క్లుప్తంగా

ఒంటికాలిపై నిలబడి కార్మికుల ఆందోళన



చిన్నింపేట జీడిపిక్కల ఫ్యాక్టరీ వద్ద ఒంటికాలిపై నిలబడి ఆందోళన చేస్తున్న కార్మికులు

ఏలేశ్వరం: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కార్మికులు ఆదివారం ఒంటికాలిపై నిలబడి ఆందోళన చేశారు. మండలంలోని చిన్నింపేట జీడిపిక్కల ఫ్యాక్టరీలో పని చేస్తున్న కార్మికులు ఫ్యాక్టరీ మెయిన్‌గేట్ వద్ద ఆందోళన చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫ్యాక్టరీ మూసివేతతో 409 మంది కార్మికులు రోడ్డున పడ్డారన్నారు. మూసివేసిన ఫ్యాక్టరీని వెంటనే తెరిపించాలన్నారు. ఫ్యాక్టరీ మూసివేతతో ఉపాధి కోల్పోయిన వారికి యాజమాన్యం న్యాయం చేయాలని కోరారు. తమ న్యాయమైన డిమాండ్లను నేరవేర్చాలన్నారు. కార్యక్రమంలో కార్మికులు వీర బాబు, చక్రధర్, గోవిందు, ధర్మాజీ, దుర్గా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ల్యాబ్ టెక్నీషియన్‌కు ఉత్తమ సేవా అవార్డు



కాకినాడలో డీఎంఅండ్‌హెచ్‌ఓ నుంచి అవార్డు అందుకుంటున్న అలేఖ్య

తొండంగి: మండలంలోని ఏవీ నగరం పీహెచ్‌సీలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పని చేస్తున్న అలేఖ్య ఉత్తమ సేవా అవార్డు పొందారని పీహెచ్‌సీ వైద్యాధికారి పి.రవికుమార్ తెలిపారు. పీహెచ్‌సీలో ఎయిడ్స్ రోగులకు వివిధ రకాల పరీక్షలు చేసి ఉత్తమ సేవలు అందించినందుకు గాను ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా కాకినాడలో జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి డాక్టర్ నరసింహనాయక్ ఆమెకు ఉత్తమసేవా అవార్డు అందించారన్నారు. పురస్కారం పొందిన అలేఖ్యను ఆస్పత్రి వైద్యురాలు పి.భారతి, హెల్త్‌సూపర్ వైజర్లు, ఇతర సిబ్బంది అభినందించారు.


హైందవ శంఖారావం కరపత్రాల ఆవిష్కరణ



ఏలేశ్వరంలో కరపత్రాలు ఆవిష్కరిస్తున్న బీజేపీ నాయకులు

ఏలేశ్వరం: విజయవాడలో వచ్చే నెల 5న నిర్వహించే హైందవ శంఖారావం సభను విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గండి కొండలరావు పిలుపునిచ్చారు. పట్టణంలో ఆదివారం బీజేపీ, వీహెచ్‌పీ కార్యకర్తలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందూ ఆలయాలను ప్రభుత్వ ఆధీనం నుంచి తప్పించి ఉత్తమ ధార్మిక సంస్థలకు అప్పగించాలని, దేవాలయాలకు స్వయం ప్రతిపత్తి కల్పించాలని కోరుతూ మండలాల వారీగా సభలు నిర్వహిస్తున్నామన్నారు. హైందవ శంఖారావానికి ప్రజలు వేలాదిగా తరలివచ్చి హిందూ ఐక్యత చాటాలన్నారు. శంఖారావం కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు ఆకుల హరిబాబు, తోట వీరరాఘవరావు, కొల్లా శ్రీనివాస్ పాల్గొన్నారు.

భగవద్గీత శ్లోకాల పోటీలకు విశేష స్పందన



న్యాయనిర్ణేతలను సన్మానిస్తున్న విశ్వహిందూ పరిషత్ సభ్యులు

ఏలేశ్వరం: పట్టణంలో ఆదివారం విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన భగవద్గీత శ్లోకాల పోటీలకు విశేష స్పందన లభించింది. మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన సుమారు 150 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. స్థానిక కోనేటిబడి ఆవరణలో విశ్వహిందూ పరిషత్ అనుబంధ దుర్గావాహిని, మాతృశక్తి, లలితా సత్సంగం ఆధ్వర్యంలో భగవద్గీతలోని 11వ అధ్యాయంలో 20 శ్లోకాలపై పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు న్యాయనిర్ణేతలుగా యల్లపు సూర్యనారాయణ, తోటరాఘవరావు, వాగు రోహిణి, కటకం కిరిటీ వ్యవహరించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. విశ్వహిందూ పరిషత్ అధ్యక్ష, కార్యదర్శులు ఏడీపీ ప్రసాద్, కటకం కిరిటీ, తూమురౌతు గురయ్య పాల్గొన్నారు.

ఏలేశ్వరం అధికారుల నంబర్లు

తహసీల్దార్	– 98499 03921
ఎండీపీఓ కార్యాలయం	– 98493 36599
ఎంఈఓ	– 94942 10420
ఏపీఓ	– 70939 98217
ఏపీఎం	– 73373 16825
ఎస్సై	– 94409 04835
మండల వైద్యాధికారి	– 99662 06287
నగర పంచాయతీ కమిషనర్	– 96520 65430
మండల వ్యవసాయాధికారి	– 83310 56609
ఫారెస్టు రేంజర్	– 94403 28540



సిరిపురంలో ధాన్యాన్ని ఒబ్బిడి చేస్తున్న రైతులు



ఎ.కొత్తపల్లిలో పనలపై తడిసిన పంటను చూపుతున్న రైతు సుబ్రహ్మణ్యం



గోకవరం మండలంలో కోత దశకు చేరిన వరి చేలు

ఫెంగల్.. అన్నదాత హడల్

- తుపాను ప్రభావంతో వర్షాలు
- ఆందోళన చెందుతున్న రైతులు
- పంట ఒబ్బిడిలో బిజీబిజీ

గోకవరం: ఫెంగల్ తుపాను ప్రభావంతో రెండు రోజులుగావర్షాలు కురుస్తున్నారు. అకాల వర్షాలతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గోకవరం నియోజకవర్గంలో ఈ ఏడాది రైతులు 17 హెక్టార్లలో రైతులు ఖరీఫ్ వరిసాగు చేపట్టారు. గోకవరం మండలంలో 5,389 హెక్టార్లు, జగ్గంపేటలో 4 వేల హెక్టార్లు, గండేపల్లిలో 3,500 హెక్టార్లు, కిర్లంపూడిలో 4,500 హెక్టార్లలో రైతులు వరి సాగు చేశారు. ప్రస్తుతం పంట కోత దశలో ఉంది. ఇప్పటికే పలువురు రైతులు కోతలు కోసుకుని ధాన్యాన్ని కళ్లాల్లో ఆరబెట్టుకున్నారు. ఈ సమయంలో తుపాను ప్రభావంతో వాతావరణం మారింది. గత రెండు రోజులుగా చిరుజల్లులు కురుస్తుండటంతో రైతుల్లో ఆందోళన మొదలైంది. చాలా మంది రైతులు సంప్రదాయ పద్ధతిలో కోతలు కోసి ధాన్యాన్ని కళ్లాల్లో ఆరబెట్టుకోగా, వ్యవసాయ శాఖ అధికారుల సూచనలతో కొంతమంది రైతులు మెషీన్లతో కోతలు నిర్వహిస్తున్నారు. తుపాను హెచ్చరికలతో ధాన్యం ఆరబెట్టుకునే అవకాశం లేకపోవడంతో రైతులు ధాన్యాన్ని కళ్లాల్లోనే గుట్టలుగా పోసి టార్పాలిన్‌లు కప్పి ధాన్యం తడవకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. గోకవరం మండలంలో 5389 హెక్టార్లలో ఖరీఫ్ సాగు చేపట్టగా ఇప్పటి వరకు రెండు వేల హెక్టార్లలో పంట కోతలు జరిగాయి. 150 హెక్టార్ల పంటను రైతులు కుప్పలుగా వేసి భద్రపర్చుకున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా 7020 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని అధికారులు మిల్లులకు తరలించారు.



తుని మండలం డి.పోలవరంలో వర్షానికి తడిసిన వరి పనలు



తంటికొండలో ధాన్యాన్ని ఒబ్బిడి చేస్తున్న రైతులు

వర్షాలతో రైతులకు ఇబ్బందులు

ఏలేశ్వరం: తుపాన్ ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో ఈ ఏడాది 6,162 ఎకరాల్లో రైతులు ఖరీఫ్ సాగు చేశారు. ప్రస్తుతం దాదాపు 50 శాతం వరి కోతలు పూర్తయ్యాయి. కొన్నిచోట్ల నూర్పుడిలు పూర్తి చేశారు. కొంతమంది రైతులు ధాన్యాన్ని మిల్లులకు సైతం తరలించారు. మండలంలోని లింగంపర్తి, భద్రవరం, పేరవరం, సిరిపురం తదితర గ్రామాల్లో కోతలు దాదాపుగా పూర్తి కావచ్చాయి. మర్రివీడు, తూర్పులక్ష్మీపురం, తిరుమాలి, యర్రవరంల్లో కోతలు పూర్తి కావల్సి ఉంది.

తడిసిన వరి పనలు

తుని రూరల్: ఫెంగల్ తుపాను ప్రభావంతో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఖరీఫ్ వరి పంటలు నానుతున్నాయి. ఇప్పటికే కోసిన పంట పనలపై ఉండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కోత కోసిన ధాన్యం రంగు మారిపోతుందని, కోతలు చేపట్టని పంట నుంచి ధాన్యపు గింజలు నేల రాలిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పొలాల్లోనే చెట్లపై పత్తి తడిసి ముద్దవుతుందని పత్తి రైతులు వాపోతున్నారు. ఈ సంవత్సరం తుని మండలంలో మూడు వేల ఎకరాల్లో ఖరీఫ్ వరిసాగు, 350 ఎకరాల్లో పత్తి సాగవుతుంది. ఇప్పటివరకు రెండు వందల ఎకరాల్లో కోతలు జరిగినట్టు ఏఓ అశోక్ కుమార్ తెలిపారు. కొద్దిపాటి వర్షాలు ఆరుతడి పంటలకు, ఉద్యాన పంటలకు మేలు చేస్తుందని ఉద్యాన అధికారి జి.విజయలక్ష్మి పేర్కొన్నారు. తాండవ రిజర్వాయర్‌లో 370.90 అడుగులు, పంపా రిజర్వాయర్‌లో 96.98 అడుగులు నీటి నిల్వలు ఉన్నట్టు ఆయా ప్రాజెక్టుల అధికారులు తెలిపారు.

తెరిపివ్వని వాన

తొండంగి: ఫెంగల్ తుపాను ప్రభావంతో మండలంలో రెండు రోజులుగా వర్షాలు ఎడతెరిపి లేకుండా కురుస్తున్నాయి. వర్షానికి మెట్ట, పల్లపు ప్రాంతాల్లో వరిపంట పనలపై తడవటంతో రైతులు లబోదిబోమంటున్నారు. ఎ.కొత్తపల్లి, బెండపూడి, పి.అగ్రహారం, రావికంపాడు, పి.ఇ.చిన్నాయపాలెం, గోపాలపట్నం తదితర ప్రాంతాల్లో కోత కోసిన పంట పనలపై పూర్తిగా తడిసింది. దీంతో తడిసిన ధాన్యాన్ని కొనే నాథుడే ఉండడంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం పంట నష్టపోయిన రైతులను గుర్తించి పరిహారం అందించడంతో పాటు తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. కాగా ఆదివారం వర్షంతో పాటు ఈదుర గాలుల ప్రభావానికి పలు చోట్ల హోర్డింగ్‌లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. పలు ప్రాంతాల్లో చెట్లు కొమ్మలు విరిగి వైర్లు తెగడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. యుద్ధప్రాతిపదికన విద్యుత్‌శాఖ సిబ్బంది చర్యలు చేపట్టి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

కోతలు వాయిదా వేసుకోవాలి



తుపాను ప్రభావంతో వర్షాలు కురుస్తున్నందున ప్రస్తుతం రైతులు కోతలను నిలుపుదల చేయాలి. కోసిన పంటను సురక్షిత ప్రాంతాలకు తరలించాలి. ధాన్యం తడవకుండా జాగ్రత్తలు పాటించాలి. రైతులు వ్యవసాయాధికారుల సూచనలు ఎప్పటికప్పుడు పాటించాలి.

– రాజరాజేశ్వరి, మండల వ్యవసాయాధికారి, గోకవరం

క్రీడలతో శారీరక, మానసిక ఆరోగ్యం



కీడల్లో బహుమతులు పొందిన విద్యార్థులతో అతిథులు



టీం రక్ష లోగోను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ శ్యాంప్రసాద్

తుని: క్రీడలతో శారీరక, మానసిక ఆరోగ్యం కలుగుతుందని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్ అన్నారు. స్థానిక రోటరీక్లబ్ ఆధ్వర్యంలో నెల రోజుల పాటు నిర్వహించిన రంగం యువజనోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ముగింపు వేడుకల్లో కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలన్నారు. వ్యసనాలకు లోనుకాకుండా ఉత్తమ భవిష్యత్‌కు బంగారు బాటలు వేసుకోవాలన్నారు. సమాజ హితం కోసం రోటరీక్లబ్ చేస్తున్న సేవలు ప్రశంసనీయమని కొనియాడారు. యువజనోత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన 14 విభాగాల క్రీడాల్లో పాల్గొన్న 500 మంది విద్యార్థులకు కలెక్టర్ చేతుల మీదుగా మెమెంటోలు, మెడల్స్, సర్టిఫికెట్లు అందజేశారు. యువతకు డ్రగ్స్, బెట్టింగులు, ఆడపిల్లలపై జరుగుతున్న లైంగిక దాడులపై అవగాహన కల్పించే లక్ష్యంతో తుని రోటరీక్లబ్ ఏర్పాటు చేస్తున్న టీం రక్ష లోగోను కలెక్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో రోటరీ ప్రతినిధులు మంగరాజు, ఎస్ పద్మావతి, ఎస్.వీర్రాజు, టి.నాగిరెడ్డి, ఈశ్వరగణేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



ధర్మవరంలో స్వామివారిని దర్శించుకుంటున్న వైఎస్సార్ సీపీ నేత మురళీకృష్ణంరాజు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ధర్మవరం మంగయ్యమ్మపేటలో ఉన్న రామాలయం వార్షికోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా సప్తాహ మహోత్సవాన్ని నిర్వహించారు. తొలుత స్వామి, అమ్మవార్లకు పండితులు అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఏడు రోజుల పాటు నిర్విరామంగా నిర్వహించే సప్తాహ మహోత్సవాన్ని వైఎస్సార్ సీపీ నాయకులు ముదునూరి మురళీకృష్ణంరాజు ప్రారంభించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు కోలా తాతబాబు, బొల్లు నాగేశ్వరరావు, కుప్పిన శ్రీను, బొల్లు సత్తాలు, మగాపు శివ, పంపన శ్రీను, మాగాపు నాని తదితరులు పాల్గొన్నారు.

ప్రజా హక్కుల సభను విజయవంతం చేయాలి



ప్రత్తిపాడు లిబరేషన్ కార్యాలయంలో వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బుగత బంగార్రాజు

ప్రత్తిపాడు: విజయవాడలో ఈ నెల 4న సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించే ప్రజాహక్కుల సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి బుగత బంగార్రాజు కోరారు. ఈ మేరకు స్థానిక లిబరేషన్ కార్యాయలంలో ఆదివారం ప్రజాహక్కుల సభల వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఐదు నెలలు గడిచినా సూపర్ సిక్స్ పథకాల ఊసే ఎత్తడం లేదన్నారు. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ అమలు చేయడంలో పూర్తిగా విఫలమయ్యిందని ఆరోపించారు. కల్లబొల్లి కబుర్లతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ఎన్నికల హామీలను గాలికివదిలేశారని దుయ్యబట్టారు. ప్రజలు కోరే పీపుల్స్ సిక్స్ సాధిద్దామనే ప్రధాన లక్ష్యంతో నిర్వహించే ప్రజా హక్కుల సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ సభకు లిబరేషన్ జాతీయ కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య, పోలిట్ బ్యూరో సభ్యుడు స్వదేశ్ భట్టాచార్య, లిబరేషన్ ఆంధ్ర, తెలంగాణ ఇన్‌చార్జులు వి.శంకర్, ఎస్.మూర్తి, ఐప్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.నాగమణి, రాష్ట్ర స్టాండింగ్ కమిటీ సభ్యుడు డి.హరనాథ్ ముఖ్య అతిథులుగా హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో లిబరేషన్ జిల్లా కార్యదర్శి ఏగుపాటి అర్జునరావు, రాష్ట్ర కమిటి సభ్యుడు మానుకొండ లచ్చబాబు తదితరులు పాల్గొన్నారు.

అవంతి సీఫుడ్స్ వద్ద గ్రామస్తుల ఆందోళన



కృష్ణాపురం శివారులో అవంతి సీఫుడ్స్ పరిశ్రమ గేటు వద్ద ఆందోళన చేస్తున్న కృష్ణాపురం గ్రామస్తులు

తొండంగి: మండలంలోని కృష్ణాపురం గ్రామ శివారులో అవంతి సీఫుడ్స్ పరిశ్రమ వద్ద ఆదివారం గ్రామస్తులు ఆందోళన నిర్వహించారు. పరిశ్రమ నుంచి విడుదలయ్యే వ్యర్థ జలాల కారణంగా దుర్వాసన, కాలుష్యం పెరిగిపోయి వ్యాధులు బారిన పడుతున్నామన్నారు. కాలుష్య నివారణకు చర్యలు చేపట్టాలంటూ నినాదాలు చేశారు. గ్రామస్తులు, యువత పరిశ్రమ గేటు వద్ద బైఠాయించి కంపెనీ వాహనాలను నిలిపివేశారు. దీంతో కంపెనీ ప్రతినిధులు గ్రామస్తులతో చర్చలు జరిపారు. రాజకీయాలకు అతీతంగా గ్రామంలో వాటర్ ప్లాంట్లు ఏర్పాటు, ఆస్పత్రి నిర్మాణం, వైద్య శిబిరాలు నిర్వహణ, పాఠశాల, శ్మశానవాటిక అభివృద్ధికి ఆర్థిక సాయం అందించాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. తమకు 20 రోజుల సమయం ఇవ్వాలని, యాజమాన్యంతో చర్చించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కంపెనీ ప్రతినిధులు గ్రామస్తులను కోరారు. అప్పటి వరకూ ఆందోళన విరమించాలని ప్రతినిధుల కోరడంతో గ్రామస్తులు శాంతించి ఆందోళన విరమించారు. నిర్ణీత సమయంలోగా స్పందించకుంటే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని గ్రామస్తులు హెచ్చరించారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



మురారిలో హోటల్ నిర్వాహకులతో మాట్లాడుతున్న సీఐ శ్రీనివాస్

గండేపల్లి: నిబంధనలు అతిక్రమించిన హోటళ్లు, దాబాలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీఐ వైఆర్కే శ్రీనివాస్ హెచ్చరించారు. గండేపల్లి మండలంలోని హైవేని ఆనుకుని ఉన్న దాబాలు, హోటల్స్‌లో ఎస్సై యువి శివ నాగబాబుతో కలిసి ఆదివారం రాత్రి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాబాలు, హోటళ్ల నిర్వహణలో సమయపాలన పాటించాలన్నారు. మద్యం విక్రయాలు, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

వైభవంగా మహాకుంభాభిషేకం



కలశాలతో ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

శంఖవరం: మండలంలోని కత్తిపూడిలో వేంచేసిన విశాలాక్షి సమేత విశ్వేశ్వరస్వామి వారికి ఆదివారం మహాకుంభాభిషేకం నిర్వహించారు. స్వామివారి ఆలయ 12వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మహాకుంభాభిషేకం చేశారు. కలశాలను శిరస్సున ధరించి భక్తులు పురవీధుల్లో భారీ ఊరేగింపు నిర్వహించారు. దారి పొడవునా భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ చైర్మన్ మంచాల సత్యనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

1,800 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

ప్రత్తిపాడు: మండలంలోని నాగులకొండపై గల వంతాడ గిరిజన తండాలో సారా స్థావరాలపై ఆదివారం ప్రత్తిపాడు ఎక్సైజ్ పోలీసులు దాడులు నిర్వహించారు. తండా శివారులో భారీగా బెల్లపు ఊట నిల్వలు బయటపడ్డాయి. ఈ దాడుల్లో సారా తయారీకి సిద్ధం చేసిన సుమారు 1,800 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్టు స్థానిక ఎక్సైజ్ సీఐ పి.శివ ప్రసాద్ తెలిపారు. సారా తయారీ సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎయిడ్స్ మహమ్మారిని తరిమేద్దాం



వి.కొత్తూరు కేజీబీవీలో మానవహారంగా ఏర్పడిన విద్యార్థినులు



ప్రత్తిపాడులో అవగాహన ర్యాలీ చేస్తున్న సీహెచ్‌సీ సిబ్బంది



తొండంగిలో అవగాహన ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

తుని రూరల్: సంపూర్ణ అవగాహనతో హెచ్ఐవీ, ఎయిడ్స్ మహమ్మారిని తరిమేద్దామని కేజీబీవీ ప్రిన్సిపాల్ అమృతవాణి అన్నారు. మండలంలోని వి.కొత్తూరు కస్తూర్బా గాంధీ విద్యాలయంలో ఆదివారం ప్రిన్సిపాల్ అమృతవాణి ఆధ్వర్యంలో ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు విద్యాలయం ఆవరణలో మానవహారంగా ఏర్పడ్డారు. ప్రమాదకర హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై ప్రిన్సిపాల్ అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

తొండంగి: మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం వైద్యారోగ్యశాఖ సిబ్బంది ఆధ్వర్యంలో ఎయిడ్స్ డేపై అవగాహన ర్యాలీలు నిర్వహించారు. తొండంగి, ఏవీ నగరం పీహెచ్‌సీల పరిధిలోని వైద్యులు, హెల్త్‌సూపర్ వైజర్లు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు కలిసి ర్యాలీ చేశారు. ఎయిడ్స్ వ్యాధిపట్ల జాగ్రత్త వహించాలని, ఎయిడ్స్ వ్యాధిని పూర్తిగా నిర్మూలించాలని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు పి.రవికుమార్, శిరీష, చైల్డ్ ఫండ్ ఇండియా లింక్‌వర్కర్స్ స్కీమ్ సూపర్‌వైజర్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ రహిత సమాజ స్థాపనలో భాగస్వాములు కావాలి

ప్రత్తిపాడు: ఎయిడ్స్ రహిత సమాజ స్థాపనలో ప్రజలు భాగస్వాములు కావాలని ప్రత్తిపాడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ) వైద్యుడు కిరణ్ చౌదరి పిలుపు నిచ్చారు. ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా ప్రత్తిపాడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ వైద్య సిబ్బంది ఆదివారం ప్రత్తిపాడులో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని వైద్యుడు కిరణ్ చౌదరి ప్రారంభించారు. మెయిన్‌రోడ్డు మీదుగా సాగిన ర్యాలీ తిరిగి సీహెచ్‌సీకి చేరుకుంది. కార్యక్రమంలో ఎయిడ్స్ కౌన్సిలర్ రమణ, టెక్నీషియన్ రాజ్‌కుమార్, సీహెచ్‌సీ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అవగాహన తప్పనిసరి

ప్రత్తిపాడు రూరల్: ఎయిడ్స్ పట్ల ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని రాచపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఆర్ఆర్ పవన్ కుమార్ అన్నారు. మండలంలోని రాచపల్లిలో ఆదివారం ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు.

ఉత్సాహంగా వనసమారాధనలు



జగ్గంపేటలో యాదవుల కార్తిక వనసమారాధనకు హాజరైన వివిధ పార్టీల నేతలు



రాచపల్లి అడ్డురోడ్డు వద్ద ఉసిరి చెట్టుకు పూజలు చేస్తున్న భక్తులు

జగ్గంపేట: కార్తిక మాసంలో చివరి ఆదివారం కావడంతో మండలంలోని పలు గ్రామాల్లో వనసమారాధనలు నిర్వహించారు. జగ్గంపేట బాలాజీ నగర్‌ను ఆనుకుని ఉన్న పామాయిల్ తోటలో భారీ వనసమారాధన ఏర్పాటు చేశారు. తొలుత కార్తిక దామోదరునికి, ఉసిరి, జమ్మిచెట్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గత నాలుగు సంవత్సరాలుగా వనసమారాధన నిర్వహిస్తున్నామని, అన్ని వర్గాల వారు ఒకే వేదికపై కలుసుకోవడం ఎంతో ఆనందాన్ని ఇస్తుందని బాలాజీ నగర్ వాసులు తెలిపారు. స్థానిక వాసుదేవ నగర్‌లో యాదవ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్తిక వనసమారాధనకు జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ యువ నేత తోట రాంజీ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారిని యాదవ సంఘం నేతలు సత్కరించారు. వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. యువత, మహిళలు ఆట పాటలతో సందడి చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఉత్సాహంగా గడిపారు.

రాచపల్లిలో..

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని రాచపల్లి అడ్డురోడ్డు వద్ద ఆదివారం కార్తిక వనసమారాధన నిర్వహించారు. రాజపాలేనికి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి గొడె హరీష్ ఆధ్వర్యంలో భారీ వనసమారాధన ఏర్పాటు చేశారు. ప్రత్తిపాడు, పరిసర గ్రామాల భక్తులు భారీగా తరలివచ్చి అన్నప్రసాదం స్వీకరించారు. తొలుత ఉసిరి చెట్టుకు ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం సహపంక్తి భోజనాలు చేశారు. చిన్నారులు, మహిళలు ఉల్లాసంగా గడిపారు. పలు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.